సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 16 । జూన్ । 2023



విత్తన దందా

పత్తి విత్తన విక్రయాల్లో అక్రమార్కులు కొత్త తరహా దందాకు తెరలేపారు. అన్ని రకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలు ఇస్తున్నా.. రైతులకు మాత్రం కొన్ని రకాలనే అంటగడుతున్నారు. 8లో



రోడ్డు టెర్రర్ 8లో

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు. ఓ చోట ముందు కారును ఢీకొట్టి, మరోచోట అదుపు తప్పిన లారీ.

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 11 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

కేసీఆర్ ఆదర్శంగా అభివృద్ధి కార్యక్రమాలు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న నీలం మధు, అధికారులు

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిట్కుల్ గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో జెండా ఎగరవేసి చిట్కుల్ గ్రామంలో చేసిన అభివృద్ధిపై పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు, నీలం మధు ముదిరాజ్ ప్రగతి నివేదక చదివి వినిపించారు. ఉత్తమ గ్రామపంచాయతీ సిబ్బందికి శాలువాతో సత్కరించి ప్రశంస పత్రాలు, శానిటేషన్ కిట్లు ఇచ్చారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీపీఓ సురేశ్ మోహన్, డీఎల్‌పీఓ సతీశ్ రెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, ఏఈపీఆర్ మల్లేశం, కార్యదర్శి కవిత, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, కృష్ణ, వెంకటేశ్, భుజంగం, మురళీ, రాజ్ కుమార్, ఆంజనేయులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రశాంత్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేష్, నారాయణ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఐకేపీ మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివపేటలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



సదాశివపేటలో పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సదాశివపేట పట్టణంలోని రవీంద్ర మోడల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోగల 177 పోలింగ్ కేంద్రాన్ని గురువారం సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిని ఆదేశించారు. గురునగర్ కాలనీలో చేపట్టిన ఇంటింటి సర్వేతీరు పరిశీలించారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, గిర్దావర్ గణేష్, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని, కల్తీ విత్తనాలు రాకుండా అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి లోని కేవల్ కిషన్ భవన్ సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వానకాలం విత్తనాలు సరఫరా చేయాలన్నారు. అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్ముతున్న డీలర్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ముందు జాగ్రత్తగా తనిఖీలు చేపట్టాలని కోరారు.

అద్దెకు భవనాలు కావాలి

సంగారెడ్డి మున్సిపలిటీ: సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల 2023–24 బ్యాచ్ విద్యార్థుల కోసం సంవత్సర కాలానికి అద్దె ప్రాతిపదికన వసతి గృహాలు ఇవ్వడానికి ఆసక్తిగల భవన యజమానులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బిహెచ్ ప్రభుదీర్ గురువారం తెలిపారు. సుమారు 80 మంది బాలికలు, 80 మంది బాలురు ఉండటానికి అనువైన వేర్వేరు భవనాలు కావాలన్నారు. ఆసక్తిగల భవన యజమానులు ఈనెల 16 నుంచి 24వ తేదీ లోపు సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

అనుమతులు నిల్

- ఇష్టా రాజ్యంగా ప్రైవేట్ స్కూల్స్ ఏర్పాటు
- ఒక్కో స్కూల్‌కి రెండు పేర్లు
- సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నట్లు ప్రచారం
- డీఈఓ ఆదేశాల మేరకు పరిశీలిస్తున్న అధికారులు



రికార్డు రూమ్‌ను సీజ్‌చేస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: విద్యా సంవత్సరం ప్రారంభమైతే తల్లిదండ్రులు తమ పిల్లలని ఇంటికి సమీపంలో ఉన్న స్కూల్‌లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు తప్ప ఆ స్కూల్ కు ప్రభుత్వ అనుమతి ఉందో, లేదో గమనించడంలేదు. విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్లే స్కూల్స్ పేరిట ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేస్తున్నారు. మరి కొన్ని స్కూల్స్ తమకు అనుకూలంగా ఉన్న స్కూల్స్ పేర్లను వారికి వారే మార్చుకుంటున్నారు. మరికొన్ని సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్లు, వస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పడంతో పాటు ప్రచారం చేసుకుంటున్నారు.

విద్యాశాఖ నిబంధనలు

- కొత్తగా ప్రైవేట్ పాఠశాలను ప్రారంభించాలనుకుంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి
- మొదటిగా ప్రారంభ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యార్థులను చేర్పించుకోవాలి
- ప్రాథమిక, ఉన్నత స్థాయికి జిల్లా విద్యాశాఖ అనుమతులు తీసుకోవాలి
- ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే ఆర్‌జేడీ ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తప్పనిసరి
- పాఠశాల విద్యా కమిషనర్ అనుమతితోనే ఉన్నత తరగతులలో అదనపు సెక్షన్లు నిర్వహించాలి
- ప్రైవేట్ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యా మండలి సమ్మతించాలి
- సీబీఎస్ఈ బోర్డు అధికారులు ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. నిర్దేశిక పాఠశాలలో రెండుసార్లు తనిఖీలు నిర్వహించి నిబంధనలు అనుగుణంగా వసతులతో పాటు ఉపాధ్యాయులు ఉంటేనే అనుమతి మంజూరు చేస్తున్నారు.

దృష్టిసారించిన అధికారులు

- జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పాఠశాలలపై దృష్టి సారించామని డీఈఓ తెలిపారు.
- పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో పటాన్‌చెరు, అమీన్ పూర్‌లో అనుమతులు లేకుండా పాఠశాలలు నడుస్తున్నాయని విశ్వసనీయ సమాచారం రావడంతో ఎంఈఓ, సీఆర్పీల తనిఖీలు చేపట్టమని ఆదేశించామన్నారు.
- అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేట పరిధిలో వీఎస్ఆర్ పేరుతో అనుమతి ఉంటే సదాశివ ఇంటర్నేషనల్ స్కూల్ పేరిట బోర్డు ఏర్పాటు చేశారు.
- డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ సిబ్బందితో కలిసి స్కూల్‌ను సందర్శించి, రికార్డులు చూపించమని అడగగా చూపించకపోవడంతో సీజ్ చేశారు.
- గత ఏడాది ఇస్నాపూర్ పరిధిలో మ్యాపిల్స్ స్కూల్‌కు అనుమతి లేకుండా నడిపించడంతో అధికారులు సీజ్ చేయగా, తిరిగి అనుమతి తీసుకొని ప్రారంభించిన విషయం తెలిసిందే.
- ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తున్న స్కూళ్లలో విద్యార్థులు చేరితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.
- ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ స్కూల్లో చైల్డ్ లైన్ ఇన్ఫో నమోదు ఉండదు.

అనుమతి లేకుండా నడిపితే చర్యలు



ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా నడుపుతున్న పాఠశాలలపై దృష్టి సారించాలని ఎంఈఓలు, సీఆర్పీలకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కిష్టారెడ్డిపేట పరిధిలో ఓ పాఠశాల ఒక పేరుతో అనుమతి తీసుకొని, మరో పేరుతో నడుపుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టాలని ఎంఈఓను ఆదేశించాం. రికార్డులు చూపకపోవడంతో సీజ్ చేశాం. జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, గ్రామాల్లో అనుమతి లేకుండా నడుపుతున్న వాటిని గుర్తించి సీజ్ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– వేంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి



మొగుడంపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

పట్టణాలతో సమానంగా పల్లెల్లో ప్రగతి

- పల్లె ప్రగతితో మారుతున్న రూపురేఖలు: కలెక్టర్ శరత్
- మొగుడంపల్లిలో పల్లె ప్రగతి దినోత్సవం



ఎడ్లబండిపై వస్తున్న కలెక్టర్ శరత్

జహీరాబాద్ టౌన్: గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని కలెక్టర్ శరత్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మొగుడంపల్లిలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 647 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పల్లెల రూపు రేఖలు పూర్తిగా మారాయని, పట్టణాలతో సమానంగా ప్రగతి పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని 14 పంచాయతీలకు వివిధ కేటగిరీల్లో అవార్డులు వచ్చాయన్నారు. అంతకు ముందు పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామ శివారు నుంచి ఎడ్లబండిపై ప్రజలతో కలిసి ఊరేగింపుగా గ్రామంలోకి వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణమ్మ, ఎంపీపీ ప్రియాంక, తహసీల్దార్, ఎంపీడీఓ, బీఆర్ఎస్ నాయకుడు విజయమోహన్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కిషన్‌పవార్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ ప్రగతి దినోత్సవాన్ని అన్ని మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేస్తారన్నారు. అనంతరం పట్టణ ప్రగతి, మౌలిక వసతుల వివరాలు తెలియజేస్తారన్నారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికులను సన్మానిస్తారని కలెక్టర్ తెలిపారు.

రజక వృత్తిదారులందరికీ ఆర్థిక సాయం అందజేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

కొండాపూర్(సంగారెడ్డి): రజక వృత్తిదారులందరికీ షరతులు లేకుండా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు పల్సాటి మహేష్ అధ్యక్షతన జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రజక వృత్తిదారులకు ఆర్థిక సహాయంగా రూ.లక్ష ప్రకటించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ రజక వృత్తిదారుడికి ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఈ పథకం అందరికీ అందజేసే విధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాలు జారీచేయాలని కోరారు.

పల్లెలు.. ప్రగతికి ప్రతీకలు

- పల్లెల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్ దే
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రుద్రారంలో ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం



గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించి, జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను నిజం చేస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతీ పల్లె ప్రగతిలో ఆదర్శంగా నిలుస్తోందని పటాన్‌చెరు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 14వ రోజు పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో ప్రతీ గ్రామం సమస్యలకు నిలయంగా ఉండేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల పురోభివృద్ధికి ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కీలక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా, జెడ్పీటీసీ సుప్రజా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, రుద్రారం సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఉప సర్పంచ్ యాదయ్య, ఎంపీటీసీలు రాజు, హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన



భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులతో అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సంజీవనగర్‌లోగల భవిత కేంద్రాన్ని గురువారం సెక్టోరియల్ అధికారి వేంకటేశం, నోడల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ సందర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్లో అందరి సహకారాన్ని తీసుకుంటూ దివ్యాంగులు, బడి బయట పిల్లల పేర్లు నమోదు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంజీవనగర్ పాఠశాల ఉపాధ్యాయ బందం, ఐఈఆర్పీలు, సీఆర్పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు గవర్నర్ సన్మానం



సదానందంను సత్కరిస్తున్న గవర్నర్ తమిళి సై

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు అంబటి సదానందం 32 సార్లు రక్తదానం చేశాడు. రాజ్ భవన్ లో రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ సత్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ గవర్నర్ తనను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణ సాంస్కృతిక వారసత్వం దేశానికే ఆదర్శం

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ సాంస్కృతిక వారసత్వం దేశానికే ఆదర్శమని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాంస్కృతిక వారసత్వం అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ తెలంగాణలో భిన్నమైన సంస్కృతి, సాంప్రదాయాలతో ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. భాష, ఆచార వ్యవహారాలు, జీవన విధానం భారత దేశంలోనే ప్రత్యేకమైనవన్నారు. అదేవిధంగా తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధిలో మిషన్ కాకతీయ పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వంచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి ఉన్న చెరువులు కనుమరుగైన నేపథ్యంలో పూడిక తీతతో చెరువులకు పూర్వ వైభవం తీసుకురావడం జరిగిందన్నారు. ఫలితంగానే రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన



సర్టిఫికెట్ వెరిఫికేషన్ తీరును పరిశీలిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుదిరాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ ప్రతాల పరిశీలన పోలీస్ కళ్యాణ మండపంలో కొనసాగింది. రెండో రోజు 750 మంది అభ్యర్థులకుగాను 641 మంది హాజరయ్యారని ఎస్పీ రమణకుమార్ తెలిపారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా తమతోపాటు వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ధ్రువపత్రాల ఒరిజినల్స్, ఒక జిరాక్స్ సెట్ తీసుకొని, తమకు కేటాయించిన రోజు రావాలన్నారు. కార్యక్రమములో అదనపు ఎస్పీ టి.ఉషావిశ్వనాథ్, పాలన విభాగం అధికారి కళ్యాణి, డీపీఓ సిబ్బంది, ఆర్టీఓ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ రోడ్డు అభివృద్ధికి నిధులు విడుదల



తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్–లింగంపల్లి రోడ్డు అభివృద్ధికి మార్గం సుగమమైంది. రోడ్డు అభివృద్ధికి మున్సిపాల్టీ నుంచి రూ.7.50 కోట్లు కేటాయించారు. కానీ, ఆ రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, తిరిగి ఏర్పాటుకు రూ.4.77 కోట్లు వెచ్చించాలని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. దాంతో ఆ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. తాజాగా ఆ సమస్యకు పరిష్కారం లభించింది. ఆ వివరాలను అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి గురువారం తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము నుంచి అమీన్పూర్ మున్సిపల్ కార్యాలయం వరకు చేపట్టనున్న 150 అడుగుల రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ పనుల కోసం హెచ్ఎండీఏ ఇటీవల రూ.4.77 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

17న బీజేపీ మోర్చాల సమ్మేళనం




మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీన సంగారెడ్డిలోని ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు బీజేపీ సంబంధించిన వివిధ మోర్చాల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు తెలిపారు. గురువారం సంగారెడ్డిలోని పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ మోర్చాల సమావేశానికి సకాలంలో హాజరై, సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులపై 'వాత్సల్యం'

- నిరాదరణ బాలలు, అనాథలకు భరోసా
- విద్య, వైద్యం కింద ఉపకార వేతనం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు
- అంగన్‌వాడీల్లో దరఖాస్తు చేసే అవకాశం



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అభాగ్యులపై ప్రభుత్వం 'వాత్సల్యం' చూపిస్తోంది. అనాథ బాలలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకం ప్రవేశపెట్టింది. 'మిషన్ వాత్సల్య' పేరుతో సమగ్ర బాలల సంరక్షణ పథకాన్ని తెచ్చింది. ఎలాంటి ఆదరణ లేని పిల్లలకు ఈ పథకం ద్వారా చేయూత అందించనుంది. ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూత అందిస్తాయి. పేదరికం కారణంగా విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆరేళ్ల పైబడి, 18 సంవత్సరాలకు లోబడిన బాలలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సంబంధిత మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారులు సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు విస్తృత ప్రచారం కల్పించాల్సిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత మండల స్థాయి కమిటీలు ఎంపిక చేసిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపి, ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

సీడీపీఓలకు ఆదేశాలు..

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తులను తీసుకోవాలని సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అర్హత కలిగిన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.వచ్చిన దరఖాస్తులను స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ స్క్రూట్నీ చేసి అర్హులను ఎంపిక చేస్తారు.
– పద్మావతి, ఐసీడీఎస్ పీడీ సంగారెడ్డి జిల్లా

అభాగ్యులకు వాత్సల్య పథకం ద్వారా ప్రభుత్వం చేయూతనందించడంపై పలువురు సామాజిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం

అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, విడాకులు తీసుకున్న తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, కుటుంబాలు వదిలేసిన పిల్లలు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, ఇంటి పెద్దను కోల్పోయినా, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లులేని పిల్లలు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహం, హెచ్ఐవీ పీడిత బాలలు, దివ్యాంగులకు ఈ మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒకొక్కరికి రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు.

క్లుప్తంగా

పూరి గుడిసె దగ్ధం


కాలిపోయిన పూరి గుడిసె వద్ద బాధితులు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్ మండలం వంగరామయ్యపల్లిలో వేముగంటి తిరుపతికి చెందిన పూరి గుడిసె బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం బాధిత కుటుంబాన్ని సర్పంచ్ వంగ విజయలక్ష్మీవెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

కంది(సంగారెడ్డి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఇంద్రకరణ్ ఎస్‌ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం ఇంద్రకరణ్ నుంచి ఇస్నాపూర్ వెళ్లేదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో ఓ మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉండవచ్చని, బ్లూకలర్ ప్యాంటు, తెల్లనిరంగు ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712656719, 8712656747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గర్భిణిపై దాడి

శివ్వంపేట(నర్సాపూర్)‌: గర్భిణిపై దాడిచేసిన ఓ మహిళపై కేసు నమోదైంది. శివ్వంపేట పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధి తాళ్లపల్లి తండాకు చెందిన సురేష్‌తో సుజాత వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కూతుళ్లు. భార్య సమ్మతితోనే సురేష్ రజితను రెండోపెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు భార్యల మధ్య గొడవ జరగడంతో సురేష్ రజితతో వేరు కాపురం పెట్టాడు. రజిత రెండున్నర నెలల గర్భవతి. గురువారం సుజాత, రజితల మధ్య గొడవ చోటుచేసుకుంది. రజితను సుజాత తిడుతూ పొట్టపై తన్నగా గర్భస్రావమైంది. పోలీసులు చికిత్స నిమిత్తం రజితను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ రబ్బరు పరిశ్రమ యాజమాన్యం కార్మికులపై సస్పెన్షన్ విధించటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహారి దీక్షలు చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య హాజరై దీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హార్టెక్స్ రబ్బరు పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులపై విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

నాయకమ్మ ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు


చిన్నకోడూరులో మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న పండితులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నాయకమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ అర్చకులు, రెడ్డి సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాయకమ్మ దయతో ప్రజలు సుభీక్షంగా ఉండాలని వేడుకున్నారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, వేద పండితులు సదాశివ శర్మ, సంగీత్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

విత్తన దందా

బ్లాక్ మార్కెట్‌లో పత్తి నిల్వలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులు
- అధిక దిగుబడిపేర రెట్టింపు ధర
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి


ప్రజ్ఞాపూర్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న మహిళలు

గజ్వేల్: పత్తి విత్తన విక్రయాల్లో అక్రమార్కులు కొత్త తరహా దందాకు తెరలేపారు. శాస్త్రీయంగా అన్ని రకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలు ఇస్తున్నా.. రైతులకు మాత్రం కొన్ని రకాలనే అంటగడుతున్నారు. అధిక దిగుబడి వస్తాయంటూ నమ్మబలుకుతూ ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరను వసూలు చేస్తున్నారు. అంతటితో ఆగకుండా సదరు రకం విత్తనాల స్టాకు లేదంటూ బుకాయిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.78లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అంచనా ఉండగా, ఇందులో 1.30లక్షల ఎకరాల్లో పత్తి సాగవనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

భారీగా ధర..
- జిల్లాలో ఏటా 5లక్షల బీటీ–2 విత్తనాలు అవసరముంటాయి. గతేడాది విత్తన ప్యాకెట్ రూ.810లు ఉండగా, ఈ ఏడాది రూ.853లకు పెరిగింది.
- గతేడాది మంచి దిగుబడులు ఇచ్చిన రెండు, మూడు రకాల విత్తనాలను ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.
- రైతులు సహజంగా ఈ రకాలను అడుగుతుండగా, స్టాకు అందుబాటులో లేదని, రెట్టింపు ధర ఇస్తే తెప్పిస్తామంటూ రైతులను మోసగిస్తున్నారు.
- ప్రధానంగా యూ పేరుతో మొదలయ్యే ఓ ప్యాకెట్ అసలు దొరకటం లేదని చెప్పడంతో రైతులు దాని కోసం పరుగులు తీస్తున్నారు.
- జిల్లాలో పలు చోట్ల గత పది రోజులుగా ఈ విత్తన దందా జోరుగా సాగుతోంది.
- అధిక ధరలు వసూలు చేస్తున్న వ్యాపారులు బిల్లులో మాత్రం ఎమ్మార్పీ ధరను రాసి రైతులకు అందిస్తున్నారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడుతున్నట్లు సమాచారం.

నిషేధిత విత్తనాలు కూడా...
- నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు అనుమతిలేని బీటీ–3 విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు.
- ఈ విత్తనాలను వేస్తే బీటీ–2 కంటే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా కలుపు ఉండదని నమ్మకం కలిగిస్తున్నారు.
- పంటల సాగులో కలుపు నివారణకు కూలీల ఖర్చు తగ్గుతుందంటూ అపోహ కల్పించి ప్రచారం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు.
- ఈ ప్యాకెట్లకు బీటీ–2తో పోలిస్తే రెండు, మూడు రెట్లు వసూలు చేసి దండుకుంటున్నారు.
- వర్గల్ మండలంలో 2019 ఏప్రిల్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి మాదారం, అంబర్‌పేట, దండుపల్లికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు.
- దీని తర్వాత కూడా జిల్లాలోని చాలా చోట్ల అనుమతి లేని బీటీ–3 పత్తి విత్తన దందా బయట పడింది.

చర్యలు తప్పవు



జిల్లాలో సమృద్ధిగా పత్తి విత్తన ప్యాకెట్ల నిల్వలున్నాయి. ఎవరైనా కొరత ఉందని చెబితే రైతులు నమ్మొద్దు. అధిక ధరలకు పత్తి విత్తన ప్యాకెట్లు విక్రయించినా, అనుమతిలేని బీటీ–3 విత్తనాలు అమ్మినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

వేర్వేరు ఘటనల్లో గాయపడి ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందారు.

రోడ్డుప్రమాదంలో గాయపడి...


హరిభూషణమ్మ (ఫైల్)

నర్సాపూర్, జిన్నారం: నర్సాపూర్– హైదరాబాద్ జాతీయ రహదారిపై గుమ్మడిదల పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్‌కు చెందిన హరిభూషణమ్మ, ప్రకాష్, అన్నపూర్ణ, నాగరాణిలు గాయపడిన విషయం తెలిసిందే. వారికి నర్సాపూర్‌లో ప్రథమ చికిత్స అనంతరం నిమ్స్‌కు తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ హరిభూషణమ్మ(75) గురువారం మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న సునీతారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన హరిభూషణమ్మ అంత్యక్రియలు సాయంత్రం నర్సాపూర్‌లో జరగగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నేత్రాలు దానం

ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్లు హరిభూషణమ్మ నేత్రాలు సేకరించారు. ఆమె అంగీకారం మేరకు నేత్రాలు తీసుకెళ్లామని డాక్టర్లు ఈ సందర్భంగా చెప్పారు.

బైక్‌పై నుంచి కింద పడి...


అనసూయ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మైలారం గ్రామానికి చెందిన అల్వాల్ ఆంజనేయులు– అనసూయ(48) దంపతులు ఒడిబియ్యం పోసుకునేందుకు ములుగు మండలం కొట్యాలకు వెళ్లారు. ఆదివారం రాత్రి వారు బైక్‌పై తిరిగొస్తుండగా నర్సంపల్లి శివారులో అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అనసూయను లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లి..


రక్షిత్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన వగలబోయిన రక్షిత్(18) తన సోదరి వివాహ పత్రికలను పంచడానికి స్నేహితునితో కలిసి బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా చేర్యాలలో ఈ నెల 8వ తేదీన డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ ఘటనలో స్నేహితునితో పాటు రక్షిత్ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలైన రక్షిత్‌ను నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అకస్మాత్తుగా చిన్నారి మృతి


సుస్మిత(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: అకస్మాత్తుగా ఓ చిన్నారి మృతి చెందింది. పటాన్‌చెరు ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ నకు చెందిన అంజమ్మకు ఎనిమిదేళ్ల క్రితం దుర్గేష్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మూడేళ్ల కిందట అంజమ్మ పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం వడ్డెర కాలనీకి వచ్చింది. అమ్మగారి ఇంటి పక్కనే పిల్లలతో కలిసి ఉంటూ కూలి పనులకు వెళుతోంది. సోదరుడి భార్య ప్రసవం కావడంతో ఈనెల 14వ తేదీన పిల్లలను పక్కనే ఉంటున్న తల్లి మల్లమ్మ వద్ద వదిలిపెట్టి నిలోఫర్ ఆస్పత్రికి వెళ్లింది. అంజమ్మ రెండో కూతురు సుస్మిత(5) బుధవారం రాత్రి భోజనం తిన్న తర్వాత వాంతులు చేసుకొని పడుకుంది. గురువారం తెల్లవారుజామున నీరు తాగిద్దామని సుష్మితను అమ్మమ్మ లేపగా లేవలేదు. దీనితో అంజమ్మ సోదరుడు ఎల్లేష్, మరో సోదరుడు రమేష్‌లు చిన్నారిని స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. వారి సూచన మేరకు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాలిక మృతదేహన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు లెక్కిస్తుండగా చోరీ

సంగారెడ్డి టౌన్ : బ్యాంకులో ఓ మహిళ నగదు లెక్కిస్తుండగా చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన సామేల్ అతడి భార్య చమంతలు గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎస్‌బీఐకి బంగారం లోన్ చెల్లించేందుకు రూ.2లక్షలు తీసుకొచ్చారు. చమంత కౌంటర్ వద్ద డబ్బులు లెక్కిస్తుండగా ఓ గుర్తు తెలియనివ్యక్తి 48 వేల నగదు తీసుకున్నాడు. గమనించి బ్యాంక్ క్యాషియర్ చెప్పాడు. అప్పటికే ఆ గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. బ్యాంకులో లెక్కిస్తుండగా తమ నగదును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లినట్టు సామెల్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనపర్తి జిల్లా, గడ్కర్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తొల్ల రాజు(37) ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి కోసం గజ్వేల్‌కు వచ్చాడు. రాజు తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా భార్య లక్ష్మీ కూలి పనులకు వెళుతోంది. ఈ క్రమంలో తరచు వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 12న గొడవ జరగడంతో లక్ష్మీ మహబూబ్‌నగర్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లింది. బుధవారం మరోసారి ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం రాజు కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూసే సరికి మృతి చెందినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో...

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. గుల్బర్గాకు చెందిన వడ్డె గౌరమ్మ –సుభాష్ దంపతులు మూడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గండిగూడెం వద్ద ఉంటున్నారు. సుభాష్ మేస్త్రి పనిచేస్తుండగా, మొహంపై ఎలర్జీ కావడంతో బంధువుల శుభకార్యాలకు వెళ్లేవాడు కాదు. అయితే మూడు రోజుల క్రితం గుల్బర్గాకు భార్య గౌరమ్మ వెళ్లగా సుభాష్ ఇంటి వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో తిరిగి గౌరమ్మ 14వ తేదీ మధ్యాహ్నం ఇంటికి రావడంతో అప్పటికే మద్యం సేవించి సుభాష్ పడుకొని ఉన్నాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వెళ్లిన సుభాష్ తిరిగి రాలేదు. రాత్రి గండిగూడ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపానికి గురై..


మహిపాల్ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం..పట్టణంలోని నర్స్‌ఖేడ్ వీధికి చెందిన కాశం మహిపాల్(45) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య సుజాత ప్రభుత్వఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. తరచు దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన మహిపాల్ పెంట్ హౌస్‌లోకి వెళ్లి కేబుల్ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్నాథం తెలిపారు.

ఐదుగురి అదృశ్యం...

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యమయ్యారు.

ఇంట్లో ఎవరికి చెప్పకుండా


సుజాత(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లి అదృశ్యంపై ఓ కుమారుడు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం...హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతడి తల్లి సుజాత(65) 14వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద, వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన తల్లి అదృశ్యమైనట్టు కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని...


సనా ఫాతిమా (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: కూతురి అదృశ్యంపై ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన ఎండీ ఫయాజ్ కార్పెంటర్ పనిచేస్తున్నాడు. ఈయన కూతురు సనా ఫాతిమా ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో సనాఫాతిమా ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో కూతురు కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యమైన ఘటనలో ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో....


మద్దెల నర్సవ్వ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డికి చెందిన వృద్ధురాలు మద్దెల నర్సవ్వ ఇంట్లో తరచు కుటుంబ కలహాలు జరుగుతుండేవి. దీంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేక పోయింది. నర్సవ్వ కూతురు బిట్ల భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల మధ్య గొడవ జరిగి..

శివ్వంపేట(నర్సాపూర్): కొడిపల్లి మండలం వెల్మకన్న గ్రామానికి చెందిన ఉరడి రమేష్ భార్య మానసతో కలిసి మూడు రోజుల క్రితం శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్లలో ఉంటున్న వారి బంధువుల వద్దకు వచ్చారు. అక్కడ దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో రమేష్ బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వెతికినా ఆచూకీ లభించలేదు. రమేష్ భార్య మానస గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భార్యను తీసుకురావడానికి వెళ్లి...


వెంకన్న (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో నివాసం ఉండే వెంకన్న కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 20వతేదీన అతని భార్య జ్యోతి పుట్టింటికి వెళ్లింది. పదిరోజుల తర్వాత వెంకన్న భార్యను తీసుకొచ్చేందుకు అత్తగారింటికని సూర్యాపేటకు బయలుదేరాడు. పదిహేను రోజులైనా కొడుకు రాలేదని వెంకన్న తండ్రి గురవయ్య కోడలుకు ఫోన్ చేశాడు. తన భర్త అసలు ఇక్కడకు రాలేదని మామతో చెప్పింది. దీంతో గురవయ్య తన కొడుకు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సూచిక బోర్డు ఏర్పాటు



గ్రామకంఠం స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధి అల్లీనగర్ గ్రామ కంఠం స్థలాన్ని కబ్జా చేసిన పరిశ్రమ యాజమాన్యం రోడ్డు వేసేందుకు యత్నించటంతో ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం గ్రామ పంచాయతీ ఈఓ నరేశ్ ఆధ్వర్యంలో గ్రామ కంఠం సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని గ్రామ అవసరాలకు ఉపయోగించుకుంటామని ఈఓ తెలిపారు.

ప్రభుత్వ చర్యలు భేష్

వరల్డ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ క్యూ డెంగ్‌యూ


కొండపోచమ్మసాగర్ పంప్‌హౌస్ వివరాలు తెలుసుకుంటున్న డబ్ల్యూఎఫ్ఏఓ డైరెక్టర్ జనరల్ క్యూ డెంగ్‌యూ

గజ్వేల్: పదేళ్ల క్రితం సాగునీరు లేక తల్లడిల్లిన రోజుల నుంచి నేడు రిజర్వాయర్ల ఏర్పాటుతో రెండు పంటలు పండించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలుస్తున్నాయని వరల్డ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(డబ్ల్యూఎఫ్ఏఓ) డైరెక్టర్ జనరల్ క్యూ డెంగ్‌యూ అన్నారు. జీ–20 దేశాల సదస్సులో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన డెంగ్‌యూ గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో పర్యటించారు. ఎఫ్ఏఓ ప్రతినిధులతో కలిసి కొండపోచమ్మసాగర్, రైతువేదికలను సందర్శించగా, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వీరికి స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. మర్కూక్ రైతువేదికను సందర్శించి కొద్దిసేపు రైతులతో ముచ్చటించారు. గతానికి, ప్రస్తుతానికి వచ్చిన మార్పులు, ఆదాయం పెరుగుదలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించి, రైతులు మాట్లాడగా, ఆ విషయాలను డెంగ్‌యూకు ఇంగ్లిష్‌లోకి అధికారులు అనువదించారు. ఈ సందర్భంగా డెంగ్‌యూ మాట్లాడుతూ తాను కూడా రైతుబిడ్డనేనని, చైనాలో తమ కుటుంబానికి రెండున్నర ఎకరాల పొలం ఉందన్నారు. 50 ఏళ్ల కిందటే తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం నేర్చుకున్నానన్నారు. చైనాలో రాక్ రిజర్వాయర్‌ల నిర్మాణంతో సాగునీటి సమస్య తీరిందన్నారు. రైతుబిడ్డగా ఉన్న తానూ నేడు ఎఫ్ఏఓ డైరెక్టర్ జనరల్‌గా రాణిస్తున్నానని, కష్టపడితే ఎవరైనా ఈ స్థాయికి చేరుకోవచ్చన్నారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. మహిళలు వ్యవసాయరంగంలో రాణిస్తున్నారని తెలిసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి హన్మంతు, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి ములుగు ఏడీఏ అనిల్, మర్కూక్ ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, రైతులు పాల్గొన్నారు. పర్యటనలో ఎఫ్ఏఓ ప్రతినిధులు నమస్కారం అంటూ స్థానికులను పలకరించారు.

రోడ్డు టెర్రర్

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు.

జాతీయ రహదారిపై కార్లు ఢీ


కాళ్లకల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన కార్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలపరిధిలోని కాళ్లకల్ శివారులో మేడ్చల్ వైపు వెళుతున్న కారును వెనుక వస్తున్న మరో కారు ఢీ కొట్టింది. వీటి వెనకాలె మరో కారు, ప్రయాణికులతో ఉన్న ఆటో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు రోడ్డు పక్కన గుంతలో పడిపోయింది. కాగా వాహనాల్లో ఉన్న ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలు అయ్యాయి. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ఒక్కసారిగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు...

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం దుండిగల్ మండలం శంబీపూర్ గ్రామానికి చెందిన క్యాసారం సత్తయ్య అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్‌వైట్‌ఉడ్స్‌లో జేసీబీ నడుపుతున్నాడు.ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన శంబీపూర్ నుంచి బైక్‌పై వస్తుండగా ప్రణవ్ హోమ్స్ సమీపంలోకి రాగానే కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో క్యాసారం సత్తయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య కుమారుడు క్యాసారం భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందుకారును ఢీకొట్టి


పల్టీకొట్టిన కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముందు వెళుతున్న ఓ కారు ఢీకొట్టి మరో కారు పల్టీ కొట్టింది. పోలీసులు కథనం ప్రకారం.. చింతల్ ప్రాంతానికి చెందిన సాయికుమార్ గురువారం ఇన్నోవా కారులో శంషాబాద్ నుంచి మేడ్చల్‌కు ఓఆర్ఆర్ పైనుంచి వెళుతున్నాడు. కొల్లూర్ వద్దకు రాగానే సాయికుమార్ కారును వెనుక నుంచి మహారాష్ట్రకు చెందిన ఎస్‌క్రాస్ కారు ఢీకొట్టి పల్టీకొట్టింది. దీంతో ఎస్‌క్రాస్ కారులో ఉన్న అజిత్, రాజశ్రీలు గాయాలపాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పిన లారీ


వడియారం శివారులో అదుపుతప్పి పడిపోయిన లారీ

చేగుంట(తూప్రాన్): అదుపు తప్పి ఓ లారీ పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు స్టేషనరీ తీసుకెళుతున్న లారీ వడియారం శివారు బైపాస్ చౌరస్తా 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి అదుపు తప్పింది. అరగంట పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడగా, వాహనదారులు స్పందించి ట్రాక్టర్ల సాయంతో లారీని పక్కకు జరిపారు.